క్లుప్తంగా

గ్రూప్–2 పరీక్షను వాయిదా వేయాలి



బాన్సువాడ: గ్రూప్ –2 పరీక్షను వాయిదా వేయాలని లంబాడీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు జీవన్ కోరారు. బుధవారం బాన్సువాడలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 1 నుంచి 24 వరకు గురుకుల బోర్డు పరీక్షలు ఉన్నాయని, వాటితో పాటు ఇతర పోటీ పరీక్షలు ఉన్నాయని అన్నారు. గ్రూప్–2 పరీక్షలను నవంబర్‌లో నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్ఎస్ఓ సభ్యులు అఖిల్, మణిరత్నం, విజయ్, కార్తీక్ తదితరులున్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



ఎల్లారెడ్డి: మండలంలోని భిక్కనూర్, వెల్లుట్లపేట తదితర గ్రామాలలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మత్తమాల పీహెచ్‌సీ వైద్యులు శరత్ కుమార్ తెలిపారు. అలాగే 5 ఏళ్లలోపు చిన్నారులకు వ్యాక్సిన్లు వేసినట్లు వివరించారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులున్నారు.

గుర్జకుంటలో ఆయుష్ శిబిరం..



భిక్కనూరు: గుర్జకుంటలో ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. మండల ఆయుర్వేద వైద్యుడు వెంకటేశ్వర్లు 94 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయుష్ ఆరోగ్య కరదీపికలు ఆవిష్కరించి పంపిణీ చేశారు. సర్పంచ్ మనోరమ, సిబ్బంది మహమ్మద్‌బిన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో ఫిజియోథెరపి ..



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం గల చిన్నారులకు ఫిజియోథెరపి వైద్యులు అరుణ్ వైద్య పరీక్షలు చేశారు. చిన్నారులకు ప్రతి రోజు ఫిజియోథెరపికి సంబంధించిన వ్యాయామాలను చేయించాలని అన్నారు. సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

వస్త్ర వ్యాపారికి కన్నీటి వీడ్కోలు



భిక్కనూరు: మండల కేంద్రంలో ఆత్మహత్య చేసుకున్న వస్త్ర వ్యాపారి ముర్కి సంతోష్ అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. సంతోష్ తన ఇంట్లోనే మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసుకుని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. సర్పంచ్ తున్కి వేణు, నేతలు లింబాద్రి, గౌరిగారి రాజిరెడ్డి, మల్లారెడ్డి, సత్యనారాయణ, తదితరులున్నారు.

వీడీసీ అధ్యక్షుడిగా మర్కంటి స్వామి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లి వీడీసీ అధ్యక్షుడిగా మర్కంటి స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీడీసీ ప్రతినిధులు ద్యావరి నవీన్, నీలం రాజలింగం, బి.రాజు పాటిల్, నాగల్ల స్వామి, మీసాల శంకర్, ఆరెటి శ్రీనివాస్, డి.నర్సింలు, కుసుమ రాజు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పోచారం చౌరస్తాలో బుధవారం ఏఎస్సై కోనా రాములు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఏఎస్సై రాములు మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు తప్పకుండా వాహన ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తమ వద్ద ఉంచుకోవాలన్నారు. అలాగే అతి వేగం ప్రమాదకరమని వాహనాదారులకు తెలియజేశారు. పోలీస్ సిబ్బంది వెంకట్, గోరి, అంజి, రమేశ్ ఉన్నారు.

చదవాలంటే.. నడవాల్సిందేనా?

- నిత్యం విద్యార్థులకు తప్పని పాదయాత్ర
- లేకుంటే ఆటోలు, ద్విచక్ర వాహనాలపైనే ప్రయాణం
- ఆర్టీసీ బస్సులు నడపాలని విద్యార్థుల వేడుకోలు



మద్నూర్ నుంచి చిన్న శక్కర్గకు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

మద్నూర్(జుక్కల్): ఆ విద్యార్థులకు చదువంటే ఇష్టం.. వారంతా చిన్నారులే. కుగ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో దూరంలో ఉన్న పాఠశాలలకు చేరుకోవాలంటే నడవాల్సిందే. మరికొందరు విద్యార్థులు సైకిల్‌పై పాఠశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అయినా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చదువుకునేందుకు సకల ఏర్పాట్లు చేస్తామంటున్న ప్రభుత్వ హామీలు నీటి మూటలుగానే ఉంటున్నాయి. ఉదయం లేవగానే బడికి వెళ్లే ఆత్రుత ఒక వైపు, మరోవైపు పాదయాత్ర చేయాలనే భయం విద్యార్థులను తీవ్రంగా వేధిస్తోంది. బడికి వెళ్లడం తప్పని పరిస్థితి కావడంతో విధి లేని పరిస్థితిలో విద్యార్థులంతా పాదయాత్రపైనే ఆధారపడ్డారు. లేదా అటుగా వెళ్లే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిందే. మద్నూర్, డోంగ్లీ మండలాల్లోని మొగా, పెద్ద శక్కర్గ, చిన్న శక్కర్గ, మారేపల్లి, శేఖాపూర్, హండేకేలూర్, చిన్న ఎక్లార, కోడిచిర, రాచూర్, రూసేగావ్, పెద్ద ఎక్లార, దన్నూర్, సోమూర్, ఖరగ్, చిన్న తడ్గూర్, గోజేగావ్, ఎన్‌బుర, ఇలేగావ్ గ్రామాల నుంచి రోజూ విద్యార్థులు పాఠశాల, కళాశాల వెళ్లేందుకు మండల కేంద్రానికి వస్తుంటారు. నిత్యం నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్లాల్సి వస్తుండటంతో అలిసిపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజూ నడవలేకపోతున్నాం



ప్రతిరోజూ మా గ్రామం నుంచి మద్నూర్ వరకు ఉదయం సాయంత్రం వేళల్లో మూడు కిలోమీటర్లు నడవలేకపోతున్నాం. చదువుకోవాలని ఎంతో ఇష్టం ఉన్నా నడకతోనే భయంగా ఉంది. అధికారులు మా పరిస్థితిని చూసి కనీసం సైకిళ్లను పంపిణీ చేస్తే కొంత ఉపశమనం ఉంటుంది. ప్రతి రోజూ పాఠశాలకు పోవాలంటే నడక తప్పడం లేదు.

–వేదాంత్, ఏడో తరగతి, హండెకేలూర్

ఇప్పటికైనా స్పందించాలి



మా గ్రామానికి చెందిన 20 మంది కలిసి ప్రతి రోజు మద్నూర్‌లోని ఉన్నత పాఠశాలకు చదువుకోవడానికి నడిచి వెళ్తున్నాం. ఉన్నత పాఠశాలలో చేరినప్పటి నుంచి మాకు నడక తప్పడం లేదు. ప్రతి రోజూ పెద్దబ్యాగులతో నడుచుకుంటూ వెళ్లడం ఇబ్బందిగా ఉంది. ఒక్కోసారి చదువుమానేయలని అనిపిస్తుంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించాలి.

–బీరా, ఏడో తరగతి, చిన్న శక్కర్గ

అన్ని వర్గాలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



లింగంపేటలో వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తూ..

- ప్రజా సేవే మా లక్ష్యం
- ఎమ్మెల్యే జాజాల సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా నిలుస్తోందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం ఆయన లింగంపేట మండలంలోని బోనాల్, లింగంపల్లి, కన్నాపూర్, అయిలాపూర్, లింగంపేట గ్రామాల్లో పలువురు బాధితులను పరామర్శించారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. లింగంపేట మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ ఆవరణలో 108, 102 వాహనాలకు లింగంపేట, గాంధారి, సదాశివనగర్ మండలాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ప్రజల రుణం తీర్చుకోవడానికి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నానన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్, సర్పంచ్ లావణ్య, రాంరెడ్డి, నాయకులు సిద్ధారెడ్డి, శ్రీకాంత్, సాయిలు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి

రిలయన్స్ ఫౌండేషన్ డీపీఎం రాజు



శిక్షణకు హాజరైన రైతులు, ఫౌండేషన్ సభ్యులు

కామారెడ్డి రూరల్: కూరగాయల రైతులు ఒకే రకమైన పంటను కాకుండా వివిధ రకాలైన పంటలు, ఆకు కూరగాయలు, తీగ జాతి వంటి అంతర పంటలు కూడా సాగు చేయాలని రిలయన్స్ ఫౌండేషన్ డీపీఎం రాజు సూచించారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూరగాయల సాగులో నూతన పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారులు లోకేష్, రామకృష్ణ మాట్లాడుతూ.. విత్తనాల ఎంపిక, రైతులకు కూరగాయల సాగులో మెలకువలు, చీడపురుగుల నివారణ, ఎరువుల యాజమాన్యం లాంటి విషయాలపై అవగాహన కల్పించామని వివరించారు. రిలయన్స్ ఫౌండేషన్ డీపీవో శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తాం.. హామీలు నెరవేరుస్తాం

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



కాంగ్రెస్‌లో చేరిన వారితో మాజీ మంత్రి

భిక్కనూరు: నాలుగు నెలల్లో అధికారంలోకి వచ్చి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. బుధవారం జంగంపల్లి గ్రామానికి చెందిన యాదవ సంఘంతో పాటు పలు గ్రామాలకు చెందిన మహిళలు, యువకులు పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ. 2లక్షల రుణమాఫీ అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన ద్రోహి కేసీఆర్

మాచారెడ్డి : గిరిజన ద్రోహి కేసీఆర్ అని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ విమర్శించారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బుధవారం మాచారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ విధానమని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే పోడు భూములు సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పట్టాలందిస్తామన్నారు. మాచారెడ్డి కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్ నాయక్, నాయకులు లక్ష్మారెడ్డి, నర్సాగౌడ్, పీసీసీ డెలిగేట్ ఎడ్ల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ర్యాలీకి తరలిరావాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని సర్వశిక్ష ఉద్యోగులు గురువారం నిర్వహించే ర్యాలీకి తరలిరావాలని మండల జేఏసీ అధ్యక్షుడు సంజీవ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో కరపత్రాలు ప్రదర్శించారు. సర్వశిక్ష ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండు చేస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే ర్యాలీలో పాల్గొనాలని కోరారు. ఉద్యోగులు శ్యామల, అశ్విని, సంగాగౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమయం లేదు మిత్రమా..

- గృహలక్ష్మి, మైనార్టీ బంధుకు సమీపించిన గడువు
- దరఖాస్తుదారులతో కార్యాలయాలు కిటకిట
- గడువు పెంచాలంటున్న ప్రజలు



కామారెడ్డిలో బారులు తీరిన దరఖాస్తుదారులు

కామారెడ్డి రూరల్: ఎన్నికల సీజన్ వేళ రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు చేరువయ్యేందుకు ప్రజాకర్ష పథకాలను అమలు చేస్తోంది. ఇప్పటికే దళితబంధు, బీసీలకు రూ.లక్ష సాయం ప్రకటించగా తాజాగా గృహలక్ష్మి పేరుతో నిరుపేదలకు గృహయోగం కల్పించేలా.. మైనార్టీ బంధుతో ముస్లిం, క్రిస్టియన్ వర్గాలవారికి ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది. వంద శాతం సబ్సిడీతో మూడు విడతల్లో సొంత స్థలం ఉన్న వారు ఇళ్లు నిర్మించుకోవచ్చు. మైనార్టీ బంధులో వన్‌టైం గ్రాంట్ కింద కుటుంబంలో ఒకరికి రూ.లక్ష అందించనున్నారు. ఈ పథకాల ద్వారా లబ్ధిపొందేందుకు అర్హులు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి అవకాశాన్ని మీ–సేవ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ రెండు పథకాలకు దరఖాస్తు గడువు దగ్గరపడుతుండడంతో దరఖాస్తుదారులు సమయం లేదని అధిక చార్జీలైనా చెల్లిస్తున్నారు. దరఖాస్తుదారులు తహసీల్ కార్యాలయాలకు బారులు తీరారు. మొదటి విడతగా గురువారం నాటికి ఆఖరి తేదీ అని ప్రకటించడంతో ఎలాగైనా తమ పేరు మొదటి జాబితాలో రావాలనే ఉద్దేశంతో ప్రజలు దరఖాస్తులు చేసుకోవడానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దరఖాస్తుల సమర్పణకు మరొక రోజు కూడా అవకాశం ఉండడంతో అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న విద్యార్థిని

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని బీబీజీ సంస్థ ప్రతినిధులు ఉష అన్నారు. తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం బీబీజీ సంస్థ ఆధ్వర్యంలో బంగారుతల్లి కార్యక్రమంలో భాగంగా ప్రేరణ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదివి బాలుర కంటే అధికంగా ర్యాంకులు సాధించాలన్నారు. ఇతరులపై ఆధారపడకుండా తనకు తాను నిలబడేలా తయారు కావాలన్నారు. సర్పంచ్ సంజీవులు, ప్రిన్సిపల్ లక్ష్మీబాయి, సంస్థ ప్రతినిధులు నీరజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రలోభ పెడుతోంది



భిక్కనూరు: ప్రజలను ప్రలోభాలకు గురిచేసి తమ పార్టీలోకి చేర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కుయుక్తులు పన్నుతోందని భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన యువకులు చేరకున్నా.. చేరినట్లు తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాజలింగం, సతీష్, నర్సింలు, సాయగౌడ్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

బాన్సువాడ రూరల్: జూనియర్ పంచాయితీ కార్యదర్శులను రెగ్యులర్ చేయడంతో పాటు ప్రభుత్వం తరఫున కావాల్సిన బెనిఫిట్‌లను అమలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం హర్షణీయమని పంచాయతీ కార్యదర్శులు అన్నారు. బుధవారం బాన్సువాడ ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయితీ కార్యదర్శిలు సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నీరజావెంకట్ రాంరెడ్డి మాట్లాడుతూ..కార్యదర్శిలందరూ సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉండాలని అన్నారు. అంతకుముందు బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కార్యదర్శులు సన్మానించారు.

రెగ్యులరైజ్ చేయాలని జేపీఎస్‌ల వినతి

కామారెడ్డి అర్బన్: గ్రామాల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న తమను జీవో–2560 ప్రకారం వెంటనే రెగ్యులరైజ్ చేయడానికి ప్రభుత్వంతో చర్చలు జరుపాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు బుధవారం టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయిలుకు వినతి పత్రం అందజేశారు. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను శాశ్వత ప్రతిపాదికన నియమించాలని వారు వినతి పత్రంలో కోరారు.

ఘనంగా ఆదివాసి దినోత్సవం



అన్నారంలో జెండా ఆవిష్కరిస్తున్న ఆదివాసీలు



హన్మాజీపేట్‌లో నివాళులర్పిస్తున్న నాయక్‌పోడ్‌లు

బాన్సువాడ రూరల్: ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని బుధవారం హన్మాజీపేట్‌లో ఆదివాసి నాయక్‌పోడ్ కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో ఆదివాసి జెండా ఆవిష్కరించి, కొమురంభీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రతి ఏటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జరుపుకోవాలని 1993లో ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసిందని వారు తెలిపారు. సర్పంచ్ బోనాల సుభాష్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, వార్డు సభ్యుడు వడ్ల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: అన్నారంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయక్ పోడ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సేవాలాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళలర్పించారు. అధ్యక్షులు ముత్యం పోచయ్య, ఉపాధ్యక్షులు ముత్యాల శ్యాంసుందర్ పాల్గొన్నారు.

బీజేపీ నేతల ముందస్తు అరెస్ట్



రాజంపేట పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

రాజంపేట: నిజామాబాద్ పట్టణంలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బుధవారం రాజంపేట మండల బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మండల అధ్యక్షుడు గంగారెడ్డి, కార్యదర్శి పిట్ల శ్రీను, టౌన్ అధ్యక్షులు రాము, కమ్మరి నాగరాజు, రాజిరెడ్డి, పందుల స్వామి ఉన్నారు.

భిక్కనూరు: భిక్కనూరులో బీజేవైఎం మండల అధ్యక్షుడు పైడి రాజశేఖర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బాస్కర్, ప్రధాన కార్యదర్శి విలాస్ తదితరులు అరెస్టయిన వారిలో ఉన్నారు.

సమాచారం..

పీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో పీజీటీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ భానుమతి తెలిపారు. జువాలజీ, బోటనీ, ఇంగ్లీష్, తెలుగు పోస్టులకు పీజీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గురు, శుక్ర వారాలలో డెమో ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. వేతనం నెలకు రూ.18 వేలు చెల్లించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైె నవారు ఇంగ్లీష్ మీడియంలో బోధించాలని సూచించారు

ఉచిత యోగ తరగతులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పాత పట్టణం రామాలయంలో ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7:15 గంటల వరకు నిర్వహించే ఉచిత యోగ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జై హన్‌మాన్ యోగా కేంద్రం ఆచార్యులు జి.అంజయ్య గుప్తా, సహ ఆచార్యులు యెల్లంకి సుదర్శన్‌లు తెలిపారు. వివరాలకు 9848694997 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

కాంగ్రెస్ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

బాన్సువాడ : యూత్ కాంగ్రెస్ నేతలు రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన, చేపట్టబోయే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ అన్నారు. బాన్సువాడ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద యూత్ కాంగ్రెస్ 63వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. నాయకులు ఖలేక్, అసద్‌బిన్ మోసిన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, మాసాని శేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ తిర్మల్ రెడ్డి గ్రామ ప్రజలకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో డ్రైనేజీలను జీపీ సిబ్బందితో శుభ్రం చేయించారు. సర్పంచ్ మాట్లాడుతూ..వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యదర్శి శ్రీను, జీపీ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మదన్‌మోహన్ యూత్ నాయకులు బుధవారం రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ యూత్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పండ్లను పంపిణీ చేశారు. సాయి, నరేష్, గణేష్ తదితరులున్నారు.

లింగారెడ్డిపేటలో పశువైద్య శిబిరం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేటలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేసి కౌన్సిలర్ రాము ప్రారంభించారు. సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, సాయిరెడ్డి, తదితరులున్నారు.

పశువులను కాపాడుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): వ్యాధులు సోకకుండా టీకాలు వేయించి పశువులను కాపాడుకోవాలని మండల పశువైద్యాధికారి రాంచంద్రం అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో బుధవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. సర్పంచ్ సంజీవులు, పాలకేంద్రం ముదాం గంగయ్య, బీఎంసీ మేనేజర్ నిరంజన్‌రెడ్డి, సూపర్‌వైజర్ రమేశ్ రెడ్డి, వీఎల్‌వో పోచయ్య, జేవీవోలు ప్రేంసింగ్, కొండల్‌రెడ్డి, గోపాలమిత్ర మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటల పరిశీలన

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఏవో నరేష్ పర్యటించారు. క్షేత్రస్థాయిలో వరి, మొక్కజొన్న, సోయాబీన్ పంటలను పరిశీలించారు. వరిలో కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. కాండం తొలిచే పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించామని తెలిపారు.

ఓపెన్ స్కూల్ పోస్టర్ల ఆవిష్కరణ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఓపెన్ స్కూల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళి, ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డి, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో బుధవారం కళాశాలలో హిందీ అధ్యాపకుడిగా పని చేస్తున్న ఇశ్రత్ సొంతంగా తయారు చేసిన హిందీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ అజ్మల్ ఖాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.